RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | ఆదివారం 21-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 265 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## నరహరి లాకర్లలో భారీగా డబ్బులు

కోటిన్నర నగదు స్వాధీనం

రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు

హైదరాబాద్: ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి లాకర్లలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు



2లో

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

- పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం

తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు



## హెర్మూజ్ మళ్లీ మూసివేత

- ఇరాన్ సైనిక కమాండ్ ప్రకటన
- అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని ఆరోపణ
- లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు
- 32మంది మృతి.. పలువురికి గాయాలు



2లో

టెహ్రాన్, జూన్ 20: కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా, ఇజ్రాయెల్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ వ్యూహాత్మకంగా కీలకమైన హెర్మూజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేసింది. ఈ మేరకు ఇరాన్ అత్యున్నత సంయుక్త సైనిక కమాండ్ ఖతమ్ అల్-అన్బియా ప్రధాన కార్యాలయం శనివారం ప్రకటించినట్లు మెహర్ వార్తాసంస్థ తెలిపింది. అమెరికా విశ్వాస ఘాతుకం, లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ నిరంతరం ఉల్లంఘించడం వంటి చర్యలకు ప్రతిస్పందనగానే ఈ మూసివేత చర్యను చేపట్టినట్లు ఇరాన్ సైనిక కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ ప్రతిస్పందనలో ఇది మొదటి అడుగుగా ఇరాన్ అభివర్ణించింది. తాము



## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

మెట్రో పెండింగ్ సమస్యలు..

- కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ
- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి
- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి
- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి

2లో

## ప్రకృతి సేద్యమే రైతుకు రక్ష..

- రసాయనాలతో భూమిని విషతుల్యం చేయొద్దు: సీఎం చంద్రబాబు
- ప్రకృతి సేద్యంతోనే రైతులకు, భూమికి ప్రయోజనమన్న సీఎం చంద్రబాబు
- రసాయనాల వాడకంతో పండించిన పంటలకు ప్రపంచ దేశాల తిరస్కరణ
- పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.3,125 కోట్ల సాయం విడుదల
- త్వరలో ప్రతీ రైతు ఇంటికీ ప్రజాప్రతినిధులు వస్తారని సీఎం ప్రకటన
- కడప, కర్నూలులో వ్యర్థాల నుంచి విద్యుత్ ప్లాంట్లకు శంకుస్థాపన

ప్రకృతి సేద్యంతోనే రైతులకు, భూమికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని, ఇది భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే ఆరోగ్యకరమైన బహుమతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల కన్నతల్లి లాంటి భూమి విషతుల్యంగా మారుతోందని, ఇది ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా మన ఉత్పత్తుల నాణ్యతపై

2లో





## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్: రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని

## నేడే నీట్ రీఎగ్జామ్

- మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు పరీక్ష
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
- తెలంగాణలో 73 వేల మంది సహా 22.79 ..లక్షల మంది అభ్యర్థుల హాజరు
- దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్.. 2 లక్షల మందితో భద్రత



2లో

హైదరాబాద్: దేశంలో వైద్యవిద్య ప్రవేశాల భవిష్యత్‌ను నిర్ణయించే నీట్--యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. గత నెల 3వ తేదీన నిర్వహించిన పరీక్ష.. పేపర్ లీక్, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో రద్దు కావడంతో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు మరోసారి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నేడు నీట్ రీఎగ్జామ్ నిర్వహిస్తోంది.

## క్రిమినల్స్‌కు కులం లేదు..

- వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా: పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్
- క్రిమినల్‌కు కులం, మతం, ప్రాంతం ఉండవని స్పష్టం చేసిన పవన్
- వైసీపీ రౌడీ మూకలు, గుండాల పిచ్చి వేషాలు తమ వద్ద చెల్లవని తీవ్ర హెచ్చరిక
- శాంతిభద్రతల విషయంలో పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోనని హామీ
- తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఉపేక్షించవద్దని అధికారులకు సూచన



## బెంగాల్‌కు పునర్వైభవం

- అభివృద్ధి దిశగా నూతన ప్రయాణానికి శ్రీకారం
- బెంగాల్ గాలిలో ఒక తాజాదనం కనిపిస్తోంది
- ప్రజల ముఖాల్లో కొత్త కాంతి దర్శనమిస్తోంది
- ప్రజాస్వామ్య శక్తిని అసెంబ్లీ ఎన్నికల తీర్పు నిరూపించింది
- 'పశ్చిమ్‌బంగ దివస్'వేడుకల్లో ప్రధాని మోదీ వెల్లడి
- పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం



# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయులు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్దతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# నేడే నీట్ రీఎగ్జామ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో సుమారు 73 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-- పేపర్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాలతోపాటు విదేశాల్లోని 14 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పేపర్ లీక్‌తో రద్దు... ఎన్‌టీఏపై విమర్శల వెల్లువ

గత నెల 3న జరిగిన నీట్‌కు ముందు వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ప్రశ్నపత్రం బయటకు వచ్చినట్టు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. జీవశాస్త్రం, రసాయన శాస్త్రానికి చెందిన అనేక ప్రశ్నలు ముందుగానే సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టినట్టు ఆరోపణలు రావడంతో పరీక్ష సమగ్రత దెబ్బతిన్నదని ఎన్‌టీఏ నిర్ధారించింది. దీంతో పరీక్షను పూర్తిగా రద్దు చేసి రీఎగ్జామ్ నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ విధానంపై పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కూడా కొనసాగుతోంది. ఈసారి ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొనే నిపుణులను రహస్య ప్రదేశాలకు తరలించి డిజిటల్ కమ్యూనికేషన్‌పై పూర్తిగా ఆంక్షలు విధించారు. ప్రశ్నల బ్యాంకును విస్తరించడం, ప్రశ్నపత్ర రూపకల్పనలో ఎక్కువ మంది నిపుణులను భాగస్వామ్యం చేయడం, గోప్యతా నిబంధనలను కఠినతరం చేయడం వంటి చర్యలు తీసుకున్నారు.

**పకడ్బందీ ఏర్పాట్లు చేశాం : ఎన్‌టీఏ**

నీట్ రీఎగ్జామ్ అత్యంత పారదర్శకంగా, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం వెల్లడించింది. 95,000లకు పైగా పరీక్ష గదుల్లో మొత్తం 1,38,560 సీసీటీవీ కెమెరాలను అమర్చారు. లైవ్ ఫీడ్‌లను జాతీయ, ఆయా రాష్ట్ర స్థాయిలో వర్చువల్‌గా పర్యవేక్షిస్తారు. ఎలక్ట్రానిక్ అక్రమాలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా 51,311 జామర్లను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష గదికి ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉంటారు. అభ్యర్థుల తనిఖీకి 38,795 మంది సిబ్బందిని, బయోమెట్రిక్ వెరిఫికేషన్‌కు 48,448 మందిని రంగంలోకి దించారు. ఈసారి బయోమెట్రిక్ సిబ్బందిని రెట్టింపు చేయడమే కాకుండా ఫేస్ అథెంటికేషన్ సదుపాయాన్ని కూడా కల్పించారు. సాంకేతిక సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రతి కేంద్రంలో ఒక సెంటర్ సిస్టమ్స్ ఆఫీసర్ అందుబాటులో ఉంటారు. పరీక్షా కేంద్రాల్లో సుమారు 6,700 మంది అబ్జర్వర్లు విధుల్లో ఉండగా, 100 మందికి పైగా వర్చువల్ అబ్జర్వర్లు కేంద్ర కార్యాలయం నుంచి నిరంతరం లైవ్ సీసీటీవీ ఫుటేజీని పర్యవేక్షిస్తారు. ఈ ఫుటేజీని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టూల్స్‌తో విశ్లేంచి, ఎక్కడైనా తేడాలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు, విద్యుత్ బ్యాకప్, వైద్య సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

**దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్**

రీ ఎగ్జామ్‌కు ముందు శనివారం దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. రాష్ట్రంలో కూడా ఎంపిక చేసిన అన్ని పరీక్ష కేంద్రాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో భద్రతా వ్యవస్థలు, ప్రశ్నపత్రాల రవాణా, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను పరీక్షించారు. ప్రశ్నపత్రాల భద్రత కోసం జిల్లా యంత్రాంగాలు, పోలీసు బలగాలు, ఎస్కార్ట్ బృందాలు కలిపి రెండు లక్షల మందికి పైగా సిబ్బందిని రంగంలోకి దించారు. పేపర్ లీకేజీలకు సోషల్ మీడియా వేదికలు ఉపయోగించారనే ఆరోపణల నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఎన్‌టీఏ ఖండిస్తూ, విద్యార్థులు వదంతులను నమ్మొద్దని సూచించింది. అనుమానాస్పద సమాచారం, నకిలీ పేపర్లపై ఫిర్యాదులకు ప్రత్యేక పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే నీట్ రీ ఎగ్జామ్ ఎన్‌టీఏ విశ్వసనీయత, దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల పారదర్శకతకు అగ్నిపరీక్షగా మారింది.

# ప్రకృతి సేద్యమే రైతుకు రక్ష..

ప్రభావం చూపుతోందని, అందుకే ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.పురుగుమందుల అవశేషాలు ఉండటమనే కారణంతో ఇటీవల గుంటూరు నుంచి పంపిన మూడు మిర్చి కంటైనర్లను చైనా దేశం తిప్పి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇలాంటి ఉత్పత్తులను తిరస్కరిస్తున్నాయని, ఇది రాష్ట్ర రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని అన్నారు. ఉమ్మడి గుంటూరు నుంచి వాణిజ్య పంటలు, రాయలసీమ నుంచి ఉద్యాన ఉత్పత్తులు, ఉభయగోదావరి జిల్లాల నుంచి ఆక్వా ఉత్పత్తులు పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, వీటికి మంచి ధర లభించాలంటే నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని సూచించారు. శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు, మందులు వాడాలని, భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, దీనికి గుర్తింపుగా స్విట్జర్లాండ్ నుంచి 'ప్లానెట్ ఫుడ్ ప్రైజ్' కూడా లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న పీఎం కిసాన్ పథకం కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నిధులను విడుదల చేశారు. రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతులకు రూ.3,125 కోట్ల చెక్కును అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తోందని, అందులో భాగంగా తొలి విడతగా రూ.7 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని, తాము చెప్పిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి బకాయిలు పెట్టిన గత పాలకులలా కాకుండా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోందని చంద్రబాబు వివరించారు. విత్తన సరఫరా నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ రైతుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పశ్చిమాసియా యుద్ధం, ఇతర కారణాలతో రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు. ఆక్వా రైతుల కోసం ఫీడ్ ధరను తగ్గించామని, తోతాపురి మామిడి, బర్లీ పొగాకు రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. త్వరలోనే ప్రజాప్రతినిధులు ప్రతి రైతు ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తారని ప్రకటించారు. 2027 ఏప్రిల్ నాటికి పోలవరం పూర్తి చేసి, రాష్ట్ర సాగునీటి కష్టాలు తీరుస్తామని పునరుద్ఘాటించారు.రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి విద్వేషాలు, విద్రోహాలు తప్ప అభివృద్ధి తెలీదని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రతీ అంశంలోనూ విష ప్రచారమే ఆ పార్టీ అజెండా అని అన్నారు. విషం చిమ్మడం, అభివృద్ధిని ఆపటం, ప్రజల్ని ఇబ్బంది పెట్టటం తప్ప ఆ పార్టీకి మరేమీ తెలీదన్నారు.రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు సీఎం తెలిపారు.

# బెంగాల్‌కు పునర్వైభవం

తారకేశ్వర్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అరాచక పాలన సంకెళ్లను ఛేదించుకొని బీజేపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి దిశగా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన శనివారం బెంగాల్‌లో పర్యటించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ఇక్కడ అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో 'పశ్చిమ్‌బంగ దివస్'వేడుకలకు హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. బెంగాల్ గాలిలో ఇప్పుడు ఒక తాజాదనం కనిపిస్తోందని అన్నారు. బెంగాల్ వైభవం తిరిగి మొదలైనట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల ముఖాల్లో ఒక కొత్త కాంతి దర్శనమిస్తోందని, గ్రామాల్లో ఆనందం, నమ్మకం అనే భావన వ్యక్తమవుతోందని చెప్పారు. ప్రజల ఒక్క ఓటు ఎలాంటి మార్పును తీసుకురాగలదో ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోందని వెల్లడించారు. ప్రజాస్వామ్యానికి ఉన్న శక్తిని బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తీర్పు నిరూపించిందని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వాల వల్ల జరిగిన నష్టాన్ని సరిదిద్దడానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం సూపర్‌ఫాస్ట్ స్పీడ్‌తో పని పనిచేస్తోందని మోదీ తేల్చిచెప్పారు.

**ఇప్పుడు మధ్యవర్తులు లేరు, అడ్డంకులు లేవు**

"రైల్వేలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య పరిశ్రమ, అనుసంధాన రంగాల్లో పలు ప్రాజెక్టులు ప్రారంభించాం. ఇవి బెంగాల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, కొత్త అవకాశాలను సృష్టిస్తాయి. బెంగాల్ తన నూతన భవిష్యత్తును నిర్మించుకుంటోంది. ఈ ప్రాజెక్టులు బెంగాల్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయి, ఇక్కడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రాజకీయ వైరం కారణంగా ఇక్కడ ఏళ్ల తరబడి అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి, కొన్ని ఆలస్యమయ్యాయి. నేడు ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి, ప్రతి ప్రభుత్వ పథకం ప్రయోజనాలను నేరుగా ప్రజలకు చేరవేస్తున్నాం. ఇప్పుడు మధ్యవర్తులు లేరు, అడ్డంకులు లేవు. భారత్--బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి గత ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. కంచె నిర్మాణానికి చర్యలు మొదలయ్యాయి" అని మోదీ ఉద్ఘాటించారు.

**అభివృద్ధికి గేటు వే తూర్పు భారత్**

రాయ్‌రంగ్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో నిర్లక్ష్యానికి గురైన తూర్పు భారతదేశం ఇప్పుడు అభివృద్ధికి ఒక ముఖద్వారంగా ఎదుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన శనివారం ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో పర్యటించారు. రాయ్‌రంగ్‌పూర్‌లో రూ.47,600 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. అభివృద్ధి పథంలో ఒడిశా వేగంగా ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తంచేశారు. తూర్పు భారతదేశ అభివృద్ధి ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. 'పూర్వోదయ'విధానంపై ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర వనరులను అవకాశాలుగా మారుస్తోందని చెప్పారు. ఇప్పటివరకు రూ.20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు.

**ముర్ము అత్తగారి గ్రామానికి మోదీ**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 68వ జన్మదినాన్ని

## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్‌ఎఫ్‌సీ (ఐఆర్‌ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

## నరహరి లాకర్లలో భారీగా డబ్బులు

బయటపడ్డాయి. దాదాపు కోటిన్నర నగదుతో పాటు, రెండున్నర కిలోల బంగారు అభరణాలను లాకర్లలో అధికారులు గుర్తించారు. నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు నిరాకరించడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ పక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏసీబీ అధికారులు సేకరించిన ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు.ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

## హొర్ముజ్ మళ్లీ మూసివేత

దురాక్రమణగా పేర్కొంటున్న ఈ చర్యలు కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. కాల్పుల విరమణ ఒప్పందంలోని మొదటి నిబంధనలో పొందుపరిచిన హామీలను ఇటీవలి పరిణామాలు ఉల్లంఘించాయని ఇరాన్ భావిస్తున్నట్లు ప్రకటన పేర్కొన్నది. కాగా, ఆ తర్వాత ఒక ప్రకటనలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) హొర్ముజ్ జలసంధిని అన్ని రకాల నౌకా రవాణాకు మూసివేసినట్లు ప్రకటించింది. ఈ జలమార్గం వైపు నౌకలు రావద్దని హెచ్చరిస్తూ అలా చేస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లవచ్చని పేర్కొన్నది.

**లెబనాన్‌పై భీకర దాడులు**

లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడులు 32 మందిని బలిగొన్నాయి. ఈ దాడుల్లో పలువురు గాయపడ్డారు. అనిశ్చితిలో ఉన్న శాంతి ఒప్పందాన్ని పటిష్టం చేసే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న ప్రయత్నాలకు ఇజ్రాయెల్ చర్యలు ఆటంకం కల్పిస్తాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని నబాతియే జిల్లాపై శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 16 మంది మరణించారని, 12 మంది గాయపడ్డారని లెబనాన్ పౌర రక్షణ సంస్థ తెలిపింది. సిడాన్ జిల్లాలోని ఖనారిట్‌పై ఇజ్రాయెల్ సేనలు జరిపిన దాడుల్లో ఏడుగురు మరణించారని, 13 మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ తెలిపింది.

## క్రిమినల్స్‌కు కులం లేదు..

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, నేరస్తులకు కులం, మతం, ప్రాంతం వంటివి అంటగట్టి వెనకేసుకొచ్చే సంస్కృతికి చరమగీతం పాడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడింది తన పార్టీ నాయకులైనా సరే ఉపేక్షించేది లేదని, పోలీసుల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని హామీ ఇచ్చారు. కాకినాడలో జరిగిన 'మన ఊరు – మాట మంతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన రౌడీ మూకలను, గుండాలను తొక్కి నార తీస్తాను అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

**వైసీపీ గుండాలకు బహిరంగ హెచ్చరిక**

"రక్తపాతం సృష్టిస్తాం, కుత్తుకలు కోస్తాం అని విర్రవీగుతున్న ప్రతి వైసీపీ గుండాకు కెమెరా సాక్షిగా చెబుతున్నా. మీ పిచ్చి వేషాలు మా దగ్గర చెల్లవు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ప్రజల చేతిలో నిర్ణయం ఉంటుంది. ఒకవేళ మీ ప్రభుత్వమే వచ్చినా సరే, మిమ్మల్ని తొక్కి నార తీస్తాను, గుర్తుపెట్టుకోండి. గతంలో వైసీపీకి పనిచేశామని ఇప్పటికీ విధేయత చూపిస్తున్న కొందరు అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతాను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. "దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా ఉండాలో నేను నిర్దేశించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను.



## మాజీ మంత్రి ముద్రగడ ఆరోగ్య పరిస్థితి విషమం.. వెంటిలేటర్‌పై చికిత్స

హైదరాబాద్: మాజీ మంత్రి, ప్రముఖ కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 16న హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో వెంటిలేటర్ సాయంతో చికిత్స పొందుతున్నారు. వైద్యుల సమాచారం ప్రకారం, కిడ్నీ పనితీరు బలహీనపడటంతో గత రెండు రోజులుగా డయాలసిస్ నిర్వహిస్తూ ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. వయోభారం కూడా ఉండటంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందన్న వార్తల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి కుటుంబ సభ్యులు, సన్నిహితులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నట్లు సమాచారం. ఆయన ఆరోగ్యంపై అభిమానులు, అనుచరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ముద్రగడ ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని, కొన్ని రోజులపాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.ఇటీవల కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ముద్రగడకు ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. పూర్తిగా కోలుకోవడానికి కనీసం 10 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణ అవసరమని వైద్య వర్గాలు చెబుతున్నాయి.ముద్రగడ పద్మనాభం రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా కాపు రిజర్వేషన్ల ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ప్రత్యేకమైనది. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నాయకులు, అభిమానులు ఆరా తీస్తున్నారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

**కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం**

**బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి**

**కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ**

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## ఒత్తిడితో నీట్ విద్యార్థిని ఆత్మహత్య



మియాపూర్ (హైదరాబాద్): నీట్ రీ ఎగ్జామ్‌కు సిద్ధమవుతున్న విద్యార్థిని చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మియాపూర్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ వివరాలు తెలిపారు. వైఎస్ఆర్‌కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన షేక్‌సనా నీట్ ఎగ్జామ్‌కు సిద్ధం అవుతోంది. తండ్రి ఉద్యోగ రీత్యా కువైట్‌లో ఉంటుండగా, పది రోజుల కిందట షేక్ సనా తల్లి అబ్బునిసా సొంతూరికి వెళ్లింది. దీంతో సనా తన ఇద్దరు చెల్లెళ్లు ఇంట్లో ఉంది. శనివారం చదువుకునేందుకు షేక్ సనా తన గదిలోకి వెళ్లి సాయంత్రం అయినా బయటకు రాకపోయేసరికి ఆమె చెల్లెళ్లు గది తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. స్థానికుల సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది.'తల్లిదండ్రులను మెప్పించలేకపోతున్నా.. భయం, ఒత్తిడి, ఆత్మవిశ్వాసం కోల్పో యి బాధపడుతున్నాను. చదువులో కుటుంబ అంచనాలను అందుకోలేకపోతున్నా. గత పరీక్షల్లో వైఫల్యం కారణంగా బాధపడుతున్నా. నా బాధను ఎవరితో పంచుకోవాలో తెలియదు'అని సూసైడ్ నోట్‌లో పేర్కొంది.

### సాయికృష్ణ కేసులో బిగ్ ట్విస్ట్.. స్వర్గపురి శ్మశాన వాటికలో సీఐ తనిఖీలు..

# మూడు రోజుల్లో 3 అనాథ శవాల రికార్డులు వెలుగులోకి!





విజయవాడ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాయికృష్ణ కేసు దర్యాప్తులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. కేసుకు సంబంధించిన ఆధారాల కోసం పోలీసులు విచారణను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కృష్ణలంకలోని స్వర్గపురి శ్మశాన వాటికలో కృష్ణలంక సీఐ పవన్ కిషోర్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శ్మశాన వాటికలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రశ్నించిన పోలీసులు, గత కొన్ని రోజుల రికార్డులు, కంప్యూటర్ డేటా, దహన సంస్కారాలకు సంబంధించిన వివరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో కీలక సమాచారం బయటపడినట్లు తెలుస్తోంది. స్వర్గపురి కంప్యూటర్ ఆపరేటర్ రవి మీడియాతో మాట్లాడుతూ.. గత నెల 23, 24, 25 తేదీల్లో మొత్తం మూడు అనాథ శవాలు దహనానికి వచ్చినట్లు వెల్లడించారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలు, ఎంట్రీ రిజిస్టర్లు, డిజిటల్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మే 23న విజయవాడ బస్టాండ్ పరిసర ప్రాంతం నుంచి ఒక మృతదేహం వచ్చినట్లు రికార్డుల్లో నమోదైందని చెప్పారు. సాధారణంగా పోలీసులు జారీ చేసే పంచనామా, ధృవీకరణ పత్రాల ఆధారంగానే అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తామని, మృతదేహాల వ్యక్తిగత వివరాలు తమ వద్ద నిర్ధారించే వ్యవస్థ లేదని రవి స్పష్టం చేశారు.

ఎలక్ట్రికల్ ఆపరేటర్ బాషా అదుపులోకి

కేసులో మరిన్ని కీలక వివరాలు సేకరించేందుకు స్వర్గపురి శ్మశాన వాటికలో ఎలక్ట్రికల్ దహనాల బాధ్యతలు నిర్వహించే ఆపరేటర్ బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించి గంటల పాటు విచారించినట్లు సమాచారం. బాషా మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని కాల్ డేటా, మెసేజ్‌లు, లొకేషన్ వివరాలను విశ్లేషిస్తున్నారు. దహనానికి ముందు, తర్వాత ఎవరెవరితో మాట్లాడారు? ఎవరి ఆదేశాల మేరకు ప్రక్రియ జరిగింది? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**సాయికృష్ణ మృతదేహం అనాథ శవంగా దహనం చేశారా?**

సాయికృష్ణ మృతదేహాన్ని అనాథ శవంగా చూపించి స్వర్గపురి శ్మశాన వాటికలో దహనం చేశారా? అనే అనుమానం ప్రస్తుతం దర్యాప్తులో కీలకంగా మారింది. అందుకే గత నెలలో వచ్చిన అనాథ శవాల వివరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మృతదేహాల ఫోటోలు, ఎంట్రీ రికార్డులు, పోలీస్ స్టేషన్‌ల నుంచి పంపిన సమాచారం, సీసీటీవీ ఫుటేజీలను కూడా సేకరిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే శ్మశాన వాటిక సిబ్బందితో పాటు మరికొందరిని కూడా విచారించే అవకాశముందని సమాచారం.

**దర్యాప్తు ముమ్మరం**

సాయికృష్ణ కేసులో ప్రతి చిన్న ఆధారాన్ని పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే పలువురిని విచారించిన దర్యాప్తు బృందం, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు, శ్మశాన వాటిక రికార్డులను పరస్పరం సరిపోల్చి కేసులోని మిస్టరీని ఛేదించే దిశగా ముందుకెళ్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.

# సరిహద్దులు దాటిన ప్రేమ..

## జర్మనీ యువతితో ఆంధ్రా యువకుడి వివాహం



నరసరావుపేట:లి ప్రేమకు భాషా, దేశ, సంస్కృతి భేదాలు అడ్డుకావని మరోసారి నిరూపిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు, జర్మనీలో స్థిరపడిన విదేశీ యువతి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. భిన్న దేశాలు, విభిన్న సంస్కృతులకు చెందిన ఈ జంట హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకోవడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పల్నాడు జిల్లా నకరికల్లు మండలం దేవవరం గ్రామానికి చెందిన యాంపాటి శ్రీనివాసరావు, బంగారమ్మ దంపతుల కుమారుడు యాంపాటి వెంకటేశ్వర్లు ఉన్నత విద్య కోసం కొన్నేళ్ల క్రితం జర్మనీ వెళ్లాడు. అక్కడ చదువుకుంటున్న సమయంలో రష్యా మూలాలు కలిగి ప్రస్తుతం జర్మనీలో స్థిరపడిన పలీనా అనే యువతితో పరిచయం ఏర్పడింది. విద్యాభ్యాస సమయంలో మొదలైన స్నేహం కాలక్రమేణా ప్రేమగా మారింది.ఇద్దరూ తమ ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసుకుని జర్మనీలోనే ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్న అనంతరం తమ ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు కూడా వారి నిర్ణయాన్ని గౌరవించి వివాహానికి అంగీకరించారు.ఈ నేపథ్యంలో జర్మనీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన పలీనా తల్లిదండ్రులు, బంధువులు, అలాగే వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రుల సమక్షంలో నరసరావుపేటలోని ఏ-1 కన్వెన్షన్ హాలులో వివాహ వేడుక ఘనంగా జరిగింది. తెలుగు సంప్రదాయంలో తాళి కట్టడం, జీలకర్ర-బెల్లం, సప్తపది వంటి కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఉంగరాలు మార్చుకుని వివాహ ప్రతిజ్ఞలు చేశారు.విదేశీ యువతి పలీనా తెలుగు సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే జర్మనీ నుంచి వచ్చిన అతిథులు తెలుగు వివాహ వేడుకలను ఆసక్తిగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. వివాహ వేడుకలో భారతీయ, పాశ్చాత్య సంస్కృతుల కలయిక కనిపించడంతో హాజరైన అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, పరస్పర గౌరవం, నమ్మకం ఉంటే దేశాల మధ్య దూరం కూడా అడ్డుకాదని పేర్కొన్నారు. కొత్త దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు.భిన్న సంస్కృతులకు చెందిన ఇద్దరు యువతీయువకులు ప్రేమతో ఒక్కటవడం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ వివాహం ప్రస్తుతం పల్నాడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# ప్రమాదం కాదు.. పెట్రోల్ పోసి తగులబెట్టాడు

### మిర్యాలగూడలో ముగ్గురు సజీవ దహనమైన కేసును ఛేదించిన పోలీసులు

### తనను దూరం పెట్టిందనే కోపంతో ఘాతుకానికి పాల్పడ్డ రెండో భర్త



మిర్యాలగూడ అర్బన్: చిన్నతనంలోనే వివాహం.. అంతలోనే ఇద్దరు పిల్లలు. తాగుడుకు బానిసైన భర్త అనారోగ్యంతో కన్నుమూశాడు. తోడుంటాడని నమ్మి రెండో పెళ్లి చేసుకుంటే.. అతనే కన్నపిల్లలను, ఆమె తల్లిని పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన ఉదంతం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో తీవ్ర సంచలనంగా మారింది. మిర్యాలగూడ పట్టణంలోని కలల్‌వాడ కాలనీలో ఈనెల 5న రాత్రి సుమారు 2 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో వనం చంద్రమ్మ అలియాస్ చంద్రకళ (50), ఆమె మనువడు నక్కా లక్ష్మణ్ (16), మనవరాలు నక్కా ప్రణతి (14) సజీవ దహనమైన సంగతి తెలిసిందే. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సేకరించిన సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు జరిపిన లోతైన విచారణలో నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి. అది ప్రమాదం కాదని, పక్కా ప్లాన్‌తో పెట్రోల్ పోసి తగలబెట్టి ప్రమాదంగా చిత్రీకరించారని తేల్చారు. చంద్రకళ కుమార్తె ధనమ్మ మొదటి భర్త తాగుడుకు బానిసై అనారోగ్యంతో మృతిచెందాడు. ఇద్దరు పిల్లలతో ఒంటరిగా ఉన్న ధనమ్మకు వివాహ వేదిక యాప్ ద్వారా కారు డ్రైవర్ అయిన కాళహస్తి శిరీశ్ కుమార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. వీరిద్దరూ 2023లో నరసరావుపేటలో రహస్యంగా వివాహం చేసుకున్నారు. కలల్‌వాడలో ఇల్లు నిర్మించుకునే క్రమంలో వీరి మధ్య ఆర్థిక పరమైన గొడవలు రావడంతో శిరీశ్ కుమార్‌ను ధనమ్మ దూరం పెట్టింది. మరోవైపు శిరీశ్ కుమార్ వివాహ వేదిక యాప్ ద్వారానే మరో మహిళను నమ్మించి, బంగారం లాక్కుని మోసం చేయడంతో మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై మే నెలలో జైలుకు కూడా వెళ్లొచ్చాడు. జైలు నుంచి విడుదలయ్యాక ధనమ్మపై కోపం పెంచుకున్నాడు. ధనమ్మ తండ్రి చనిపోవడంతో పిల్లలను తల్లి చంద్రమ్మ వద్ద ఉంచి, బతుకుదెరువు కోసం ఇటీవల పుణేలో కేర్‌టేకర్‌గా పనికి వెళ్లింది. ఇంట్లో ధనమ్మ లేని సమయం చూసి, ఈనెల 5న అర్ధరాత్రి శిరీశ్ కుమార్ ఓ క్యాన్‌లో పెట్రోల్ తీసుకుని ఇంట్లోకి ప్రవేశించాడు. గాఢనిద్రలో ఉన్న చంద్రమ్మ, పిల్లలు లక్ష్మణ్, ప్రణతిలపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# వికలాంగుల సంఘానికి బ్యాంకు లింకేజ్ ప్రతులు అందజేత



మెదక్ జిల్లా : ప్రజా పాలన అభివృద్ధి ప్రణాళికలో మెదక్ జిల్లా కౌడిపల్లి మండల సమైక్య లో మహిళ సంఘాలతో పాటు వికలాంగుల స0ఘాలకు కూడా బ్యాంక్ లింకేజీ సా0క్షన్ కాపీస్ ఇవ్వడం జరిగింది, ప్రజా పాలన లో భాగంగా ఘనంగా రుణమేల ఏర్పాటు చేయడం జరిగింది మహిళా శక్తి కార్యక్రమంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి వివరించడం జరిగింది, లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగడం కోసం 1)నాటు కోళ్ల పెంపకం 2) గొర్రె మేకల పొట్టేళ్ల పెంపకం 3) మండల సమైక్య నుండి బస్సు ఏర్పాటు గ్రామాలలో నూతనంగా కొత్త వ్యాపారాలు ఎంపిక చేయాలని చెప్పడం జరిగింది ఎస్వీఈపి స్పెషల్ ప్రాజెక్టు కింద సిఐఎఫ్ అమౌంటు వ్యాపారవేత్తలకు అందించాలని చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ స డిసిసిబి ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏపిఎం సంగీత,సిబ్బంది సిసి లు హాజరు కావడం జరిగింది.

# వెంకటరావు పేట్ గ్రామంలో అంగన్వాడి యూనిఫామ్స్ పంపిణీ



**మెదక్ జిల్లా :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కుతుబ్ ధీన్ చేతుల మీదుగా అంగన్వాడి సెంటర్ లో ప్రభుత్వం నుండి వచ్చిన యూనిఫామ్స్ ఇవ్వడం జరిగింది, ఇందులో భాగంగా ఉపసర్పంచ్ రామాంజనేయులు వార్డ్ నెంబర్స్ రాజు అంగన్వాడి టీచర్ నాగరాణి ఆయా మల్లమ్మ గ్రామస్తులు,పిల్లలు పాల్గొనడం జరిగింది.

# 10 కోట్ల 50 లక్షల నిధులతో గ్రామాల్లో గోదాముల నిర్మాణం

### ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

### నా నియోజకవర్గ ప్రజలే నా సొంత బిడ్డలు

### కుబీర్ మండల గ్రామస్థులకు ఇందిరమ్మా ఇండ్ల భరోసా



భైంసా డివిజన్: ముధోల్ నియోజకవర్గంలోని 35 గ్రామాల్లో రైతాంగానికి ఇబ్బందులు కలుగకుండా పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి ఒక్కో దానికి 30 లక్షల రూపాయల నిధులతో గోదాములను నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్. 10 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో ఈ పనులు జరగనున్నాయి. ముధోల్ నియోజకవర్గం లో గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత పది సంవత్సరాల పాలకుల పాలనలో నియోజక వర్గం వెనుక పడగా, ఎమ్మెల్యే పటేల్ ప్రత్యేక దృష్టి సాధించడంతో పెద్ద మొత్తంలో నిధులు వస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బాసర మండలంలోని టాక్లి, కిర్గుల్ కే, భైంసా మండలంలోని బిజ్జూర్, వానలపాడ్, మహాగాం, కుంసర, ఇలేగామ్, కుబీర్ మండలంలోని పార్డి బి, పార్డి కే, పల్సి, హంపోలి, కుంటాల మండలంలోని లింబకే, లింబా బి, విట్టాపూర్, పెంచికల్ పాడ్, ఓలా, లోకేశ్వరం మండలంలోని ధర్మోరా, పిప్రి, అబ్దుల్లాపూర్, కనకాపూర్, నరసింహనగర్ తాండ, ముధోల్ మండలంలోని గన్నోరా, ముద్గల్, బోరిగాం, అష్ట, రాంటేక్, నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, డోంగు ర్ గావ్, నందన్, తానూర్ మండలం లోని బోరిగావ్ బామ్ని, బొంద్రట్, భోసి, బెల్ తరోడా, గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

# హైదరాబాద్‌కు వర్ష సూచన.. పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక


### హైదరాబాద్ సహా పలు తెలంగాణ జిల్లాలకు ఉరుముల వర్ష సూచన

### నగరంలోని ఘట్‌కేసర్, ఉప్పల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ

### ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం

తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకోవడంతో పాటు, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నల్గొండ, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే



హైదరాబాద్ నగర శివార్లలోని నారపల్లి, రాంపల్లి, ఘట్‌కేసర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, హయత్‌నగర్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. రాత్రికి నగరం అంతటా వర్షాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం, పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో నగరంలో 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో పాటు అధిక తేమ నమోదైందని, ఇటువంటి వాతావరణం పరిస్థితులు వర్షాలకు అనుకూలమని నిపుణులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

# మానవ జీవితంలో సర్వరోగ నివారిణి యోగ

### వయస్సుతో సంబంధం లేకుండా యోగ చేస్తే సత్ఫలితాలు: యోగ టీచర్ కె. సుజాత

### ఆరోగ్యకరమైన జీవనానికి యోగాపై అవగాహన అవసరం

**నిర్మల్ జిల్లా)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం జెడ్‌పీఎస్ఎస్ హెచ్‌డబ్ల్యూ తిమ్మాపూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ప్రముఖ యోగ టీచర్ కె. సుజాత యోగ ప్రాముఖ్యతను వివరించారు. మానవ జీవితంలో యోగ సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

**చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఉపయోగకరం**

వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయవచ్చని సుజాత తెలిపారు. పిల్లల నుంచి గర్భిణీ స్త్రీలు, యువకులు, వయసు పైబడిన వారు సైతం ఎలాంటి సంకోచం లేకుండా యోగ చేయవచ్చని సూచించారు. క్రమం తప్పకుండా యోగ సాధన



చేయడం వల్ల శరీరంలో చురుకుదనం పెరిగి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు.

**గర్భిణీ స్త్రీలకు యోగతో అనేక ప్రయోజనాలు**

గర్భిణీ స్త్రీలు నిపుణుల సూచనలతో యోగ సాధన చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సుజాత వివరించారు. యోగ సాధన చేసే గర్భిణీ స్త్రీల్లో సాధారణ ప్రసవానికి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో యోగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

**విద్యార్థుల్లో యోగపై అవగాహన పెరగాలి**

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగను అలవాటు చేసుకోవాలని సుజాత సూచించారు. యోగ ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.

# భాష్యం స్కూల్లో ఘనంగా యోగ దినోత్సవం

### విద్యార్థుల మొదటి దశలోనే యోగ అవసరం టీచర్ రవీందర్

### మానవ జీవనశైలిలో యోగా ఖచ్చితమైనది

### ప్రధానోపాధ్యాయులు కదం మాధవరావు

**ముధోల్ మండలం:** నిర్మల్ జిల్లా ముధోల్ మండలం అష్ట గ్రామంలోని భాష్యం స్కూల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా టీచర్ రవీందర్ ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ యోగాసనాలపై అవగాహన కల్పించి, వాటిని ఆచరించే విధానాన్ని వివరించారు.

**ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో అవసరం**



ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కదం మాధవరావు మాట్లాడుతూ మానవ జీవితానికి యోగా ఎంతో ఆవశ్యకమైనదని తెలిపారు. ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు.




**విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన**

యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు క్రమశిక్షణతో పాల్గొని వివిధ ఆసనాలను ప్రదర్శించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించేందుకు యోగా ఒక మంచి మార్గమని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# జాతీయ మెగా లోక్-అదాలత్‌కు అపూర్వ స్పందన

### 3050 కేసుల్లో రాజీ

### సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ: 1.70 కోట్లు తిరిగి బాధితులకు అందేలా కోర్ట్ ఆదేశాలు

### అద్భుత సమన్వయం, అంకితభావంతో లోక్-అదాలత్ విజయవంతం

### జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందిని ప్రశంసించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్

**సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: జాతీయ మెగా లోక్-అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి 600- ఐపిసి కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందని, 1318- ఇ-పెట్టి, 1132 - డిడి కేసులలో అడ్మిషన్/ జరిమాజన విధించడం జరిగింది. సైబర్




నేరాలకు సంభందించి జిల్లాలో నమోదైన 84 సైబర్ క్రైమ్ కేసులలో రూ: 1.60 కోట్లు, ఎఫ్ఐఆర్ లేకుండా 83 కేసులలో 10 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ నుండి అనుమతి పొందడం జరిగిందని అన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు సమఉజ్జులు ఉంటారని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడడం ఉత్తమం అన్నారు. జిల్లా పోలీసుల అత్యుత్తమ పనితీరును కొనియాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో జిల్లా పోలీసులు కనబరిచిన అసాధారణ ప్రతిభను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. విధి నిర్వహణలో వారి అంకితభావం, సమన్వయం, సేవా దృక్పథం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి అత్యుత్తమ పనితీరు జిల్లా పోలీసులపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఎస్పీ తెలిపారు.జాతీయ లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి సత్యనారాయణ ఎస్ఐ, కోర్ట్ డ్యూటీ అధికాలు, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/